కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి


కార్మికుడికి నష్టపరిహార చెక్కును అందజేస్తున్న చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: యాజమాన్యాలు ఏకపక్ష ధోరణిలకు పోకుండా కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు అన్నారు. ప్రశాంత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో జేఎస్సీ ఇంజినీరింగ్ అండ్ సర్వీసెస్ కంపెనీలో ఏడేళ్లుగా పనిచేస్తున్న సెబాష్టియన్ అనే కార్మికుడిని యాజమాన్యం అకారణంగా విధుల నుంచి తొలగించింది. దీంతో బాధితుడు నాగరాజును ఆశ్రయించగా పరిశ్రమ ఎండీ ఆంజనేయులుతో మాట్లాడి రూ.1.5 లక్షలు నష్టపరిహారం ఇచ్చేలా ఒప్పించారు. సదరు చెక్కును సోమవారం చింతల్‌లోని కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా పనిచేస్తోందని, ఎవరికీ ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానన్నారు. కంపెనీ యాజమాన్యాలు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శేషురావు, దేవేందర్, సాయినాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోకిరీలపై నిఘా


భరత్‌కుమార్, సీఐ సూరారం

సుభాష్‌నగర్: సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోకిరీలపై నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ భరత్ కుమార్ తెలిపారు. రాజీవ్‌గృహకల్ప, తెలుగు తల్లినగర్, సాయిబాబా నగర్ ప్రధాన రోడ్లలో కొంతమంది పోకిరులు ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపైన ఉంటూ అటుగా వెళ్లే వారిని ఇబ్బందులు గురిచేస్తున్నట్లు సమాచారం రావడంతో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తూ ఇతరుల ను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారి కదలికలను తమ సిబ్బంది ఎప్పటికప్పుడు గమనిస్తుంటారని వారు తమశైలిని మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నిజాంపేట్‌లో సమగ్ర సర్వే

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఎన్యుమరేట్లు సోమవారం ఇంటింటా సర్వే చేపట్టారు. కమిషనర్ సాబేర్ అలీ నేతృత్వంలో సూపర్‌వైజర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎన్యుమరేటర్లు పాల్గొని వివరాలు సేకరించారు.


వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్లు

దరఖాస్తుల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం


గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతి ప్రతం ఇస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునారని కుత్బుల్లాపూర్ మండల సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో షాపూర్‌నగర్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కంచాలని కోరుతూ ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రోడ్ల కబ్జాలు, పింఛన్లు, ట్యాక్స్‌ల విషయమై ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఇళ్ల ట్యాక్స్‌ల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, 60 గజాలు స్థలంలో ఒకే స్లాబ్ ఉన్న వాళ్లకు వేలల్లో ఇంటి పన్నును ఏరియర్స్‌తో వేస్తున్నారని, అలాంటి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఉప కమిషనర్ మల్లారెడ్డి స్పందిస్తూ తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ (1), ఇంజినీరింగ్(5), యూజీడీ(1), కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్(3), ఇంజినీరింగ్(2), శానిటేషన్(1) ఫిర్యాదులు అందాయని అధికారులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలతోనే ప్రమాదాలు


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. ధూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై సోమవరం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతోనే చాలావరకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని ఆయన సూచించారు.

సాంస్కృతిక వైభవాన్ని పెంపొందిస్తున్న కేంద్రీయ విద్యాలయాలు

రసూల్‌పురా: ప్రధాని మోడీ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రీయ విద్యాలయాలు విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మక, కళలు వెలికి తీస్తూ రాష్ట్ర ఎక్తా పర్వ్ ద్వారా వైవిధ్యమైన దేశ సాంస్కృతిక వైభవాన్ని పెంపొందిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో జరిగిన రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కార్యక్రమాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేంద్రీయ విద్యాలయం ఒక శక్తివంతమైన మినీ ఇండియా లాంటిదన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలు అన్ని సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఉంటాయన్నారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ నిధి పాండే, భారత ప్రభుత్వ పాఠశాల విద్య విభాగం కార్యదర్శి ఐఏస్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల పరిరక్షణ దిశగా..

- ప్రణాళికలు రూపొందించిన అధికారులు
- ఖాళీ స్థలాల చుట్టూ ప్రహరీల నిర్మాణానికి శ్రీకారం

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆయా స్థలాల చుట్టూ ప్రహరీల నిర్మాణం చేపడుతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వార్డు ఆఫీస్ వరకు రూ. 18 లక్షలతో, రాజీవ్ గృహకల్పకు ఆనుకుని ఉన్న స్థలం, చర్చి సమీపంలోని రూ. 20 లక్షలతో జీహెచ్ఎంసీ అధికారులు ప్రహరీలు నిర్మిస్తున్నారు. అలాగే వార్డు ఆఫీస్ నుంచి రాజీవ్ గృహకల్ప ఒకటో బ్లాక్ వరకు కూడా ప్రహరీ నిర్మాణం ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలిసింది. కాగా అక్కడ ప్రస్తుతం ఉన్న డబ్బాలను తొలగిస్తే కానీ నిర్మాణం చేపట్టే ఆస్కారం లేదని గాజులరామారం ఏఈ తిరుపతి తెలిపారు. ఈ విషయమై పై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.


రాజీవ్ గృహకల్పలో 50వ బ్లాక్ వద్ద..


రాజీవ్ గృహకల్ప చర్చి దగ్గర..


వార్డు ఆఫీస్ సమీపంలో డబ్బాలు..

సమగ్ర సర్వేతో ప్రజలకు మేలు

జగద్గిరిగుట్ట: సమగ్ర సర్వేతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. జగద్గిరిగుట్టలోని పలు కాలనీల్లో సర్వేను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీ సంజీవరావు, మహేశ్, శ్రీను, అంగన్‌వాడీ టీచర్ ఉమా, ఆర్‌పీ సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనానికి నిప్పంటించిన దుండగులు


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

రంగారెడ్డినగర్: గుర్తు తెలియని దుండగులు వాహనానికి నిప్పంటించిన ఘటన కుత్బుల్లాపూర్ భూమిరెడ్డినగర్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూమిరెడ్డినగర్‌లో కొన్ని రోజులుగా రోడ్డుపక్కనే కారు పార్కుచేసి ఉంటోంది. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సదరు వాహనానికి నిప్పుపెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, జీడిమెట్ల ఫైర్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాగా వాహనం ఎవరిది..? ఎవరు నిప్పు పెట్టారన్న విషయం తెలియరాలేదు. ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు ఆర్పి వేయడంతో స్థానికుల ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఆల్విన్‌కాలనీ: శ్రీ సాయి అలేఖ్య సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 14 చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని కేపీహెచ్‌బీ యూపీఎస్ డీఎల్ సెంటర్‌లో సోమవారం బాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నేటి సమాజంలో 'బాలికలు ఎలా ఉండాలి' అనే వ్యాసరచన, వక్తృత్వ పోటీలను విద్యార్థులకు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. సాయి అలేఖ్య సంస్థ వ్యవస్థాపకురాలు అరుణ అశోక్, మీనా రాజకుమారి, అనురాధ పాల్గొన్నారు.

మూసీ పేరిట రాజకీయాలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌గౌడ్

నిజాంపేట్: మూసీ సుందరీకరణ పేరుతో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాజకీయాలు చేయడం మానుకోవాలని బ్లూ ఇండియా పార్టీ ప్రెసిడెంట్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసీ సుందరీకరణ క్రమంలో పేదల ఇళ్లను కూల్చడంతో పలు కుటుంబాలు వీధిన పడ్డాయని, వారికి సరైన ప్రత్యామ్నాయ మార్గాలు చూపిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళనపై ముందడుగు వేయాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో కార్పొరేట్ కెమికల్ పరిశ్రమలు, ఔషధ పరిశ్రమలకు ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు ఇవ్వడంతోనే మూసీ మురుగు కూపంగా మారిందని ఆరోపించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు షేక్ అమీనుద్దీన్, జనరల్ సెక్రెటరీ భూపాల్ కమ్మేట, నేషనల్ కోఆర్డినేటర్స్ నగేశ్ భూషణ్, మధు భూంపల్లి పార్టీ కార్యదర్శులు బానోతు లింగన్న, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రావణ ధర్మ, పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు అభిషేక్ పాల్గొన్నారు.

కుమ్మర కులస్తుల కార్తీక వనభోజనం


వన భోజన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్

చింతల్: హెచ్ఎంటీ కాలనీలో సోమవారం జరిగిన కుమ్మర కార్తీక వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల మధ్య సత్సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో కుమ్మర (శాలీవాహన) సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, ఉపాధ్యక్షుడు ఆర్. వీరేశం, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కుమ్మర శాలీవాహన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు రాజవరపు శివన్నారాయణ, అధ్యక్షుడు బాపనపల్లి నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ రాపోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రాజవరపు శివప్రసాద్, కాశయ్య, కోశాధికారి రాజు, సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం


కొలన్ హన్మంతరెడ్డితో దీపక్‌జాన్, రవికుమార్

నిజాంపేట్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవికుమార్‌కు డిసెంబర్‌లో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కోఆర్డినేటర్లుగా తెలంగాణ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో సోమవారం వారు కొలన్ హన్మంతరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు కుమార్ భూపతి, అంజాద్, సాలెంరాజు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


ముగింపు వేడుకల్లో స్కూల్ డైరెక్టర్ స్వాతి పంపాల్కర్ తదితరులు

కుత్బుల్లాపూర్: క్రీడల్లో గెలుపాటములు సహజమని ఢిల్లీ స్కూల్ డైరెక్టర్ స్వాతి పంపాల్కర్ అన్నారు. కొంపల్లి ఎన్‌సీఎల్‌లో నార్త్‌లోని 'ఐకే వైఎం' క్రీడోత్సవాల ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పోటీల్లో 50 పాఠశాలలకు చెందిన 1089 విద్యార్థులు పాల్గొన్నారు. చెస్, క్యారం, టేబుల్ టెన్నీస్, లాన్ టెన్నీస్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్వాతి పంపాల్కర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం జ్యోతిపంపాల్కర్, శిల్పా పంపాలకర్, పూజా పంపాల్కర్, ప్రధానోపాధ్యాయుడు సాయి సత్యకి, అకాడమిక్ డైరెక్టర్ అంజు పాండేగుప్తా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ జూడో సౌత్, వెస్ట్ జోన్ జట్ల ఎంపిక



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూడో హాల్లో మెన్ అండ్ ఉమెన్ సౌత్, వెస్ట్ జట్లను సోమవారం ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో సెలెక్షన్లు చేపట్టారు. ముఖ్య అతిథిగా జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ కైలాష్ యాదవ్, తెలంగాణ హ్యాండ్‌బాల్ సెక్రటరీ శ్యామల పవన్‌కుమార్, జేఎన్‌టీయూహెచ్ సుల్తాన్‌పూర్ ప్రిన్సిపాల్ నరసింహ నాయక్, ఇతర ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నెల 20 నుంచి 30 వరకు ఎల్ఎన్ సిటీ యూనివర్సిటీ, భోపాల్, మధ్యప్రదేశ్‌లో జరిగే సౌత్ వెస్ట్ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూహెచ్ జూడో జట్లు పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

ఆలయాల్లో కార్తీక సందడి


నిజాంపేట్ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆకాశదీపాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులు

నిజాంపేట్: ఆలయాల్లో కార్తీక సందడి నెలకొన్నది. కార్తీక సోమవారం సందర్భంగా నిజాంపేట్ శ్రీభ్రమరాంబ సహిత మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకంచ అర్చనలు పూజలు చేశారు. సాయంత్రం ఆకాశ దీప వీక్షణకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు గౌతం శర్మ మాట్లాడుతూ శివుడికి ప్రియమైన కార్తీకమాసంలో భక్తులు నిత్యం శివారాధన చేయడం ఎంతో పుణ్యకారకమన్నారు. ఆలయ చైర్మన్ ఏనుగుల కృష్ణారెడ్డి, ఏనుగుల నర్సింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఉమామహేశ్వర స్వామి ఆలయంలో..

సుభాష్‌నగర్: సూరారంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతిర్లింగార్చన, కోలాటం వైభవంగా జరిగింది. సాయంత్రం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్ గౌడ్ తెలిపారు.


విశేష అలంకరణలో ఉమామహేశ్వరుడు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్ ఏఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జయరాంనగర్, చర్మాస్ ఫ్యాక్టరీ, రుక్మిణి ఎస్టేట్స్, జేకే నగర్, 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వనమాస్ ప్లేకర్, ఎస్ఎల్ఎన్ డెవలపర్స్, డీమార్ట్, హర్ష ఆస్పత్రి, 11 కేవీ సన్మాన్ బెల్మార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉడ్స్ఎన్‌క్లేవ్, సన్మాన్ విల్లాస్, వైష్ణవి మిడోవ్స్, యాదిరెడ్డి బండ ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం, ఆంధ్రాబ్యాంక్ ఏరియా, జుడోషాపింగ్ మాల్, తిరుమల ఫర్నీచర్స్, 11కేవీ లేక్‌వ్యూ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు లేక్‌వ్యూ కాలనీ, ఓల్డ్ విజేత సూపర్‌మార్కెట్, సాయిబబా ఆలయ పరిసరాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహదేవపురం ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉండదని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మహదేవపురం ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు యండమూరి లేఅవుట్, ద్వారకానగర్, మల్లారెడ్డినగర్, మహదేవపురం, శ్రీరామచంద్రనగర్, బాలయ్యబస్తీ, వడ్డెర బస్తీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం

నిజాంపేట్: మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు విఫలమయ్యారని ప్రగతిగనర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్రచౌదరి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రగతిగనర్ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ జాంతో వాహనాదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన జనాభాను అనుగుణంగా రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో సమస్య మరింత జఠిలం అవుతుందన్నారు. జేఎన్‌టీయూ నుంచి బాచుపల్లి, గండిమైసమ్మ ప్రాంతాలకు వెళ్లే రోడ్డు వాహనదారులు, విద్యాసంస్థల బస్సులతో నిత్యం రద్దీగా ఉంటుందని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరగా రోడ్డు విస్తరణ చేపట్టి పూర్తి చేయాలని కోరారు. అలాగే ప్రగతినగర్ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని, రెండు వారాల్లో రోడ్డు విస్తరణ చేపట్టకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల క్షేతస్థాయి పర్యటన


విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఐఈఓ ఎం.కిషన్

సుబాష్‌నగర్: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు సూరారంలోని యూపీహెచ్‌సీ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఎంఎల్‌టీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థులు దుండిగల్ అరుంధతి ఆస్పత్రి, దుండిగల్, సూరారం యూపీహెచ్‌సీలలో ఏజేటీ నేర్చుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి డీఐఈఓ ఎం.కిషన్ ఓజేటీ తరగతులను ఇన్‌స్పెక్షన్ చేశారు. విద్యార్థులను తాము నేర్చుకున్న అంశాలపై పలు ప్రశ్నలు అడిగారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమున్, అధ్యాపక బృందం ఉన్నారు.

నిరుపేద వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం



కూకట్‌పల్లి: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన నిరుపేద వైద్య విద్యార్థిని శిగ గౌతమికి కారంకి మ్యాట్రిమోని, కారంకి ఫౌండేషన్ గౌడ్, గౌడ్స్ హెల్పింగ్ హ్యాండ్స్, జై గౌడ సేన సభ్యులు అండగా నిలిచారు. వారు సేకరించిన లక్ష రూపాయలను కూకట్‌పల్లిలోని కారంకి మ్యాట్రిమోని కార్యాలయంలో సోమవారం శిగ గౌతమికి అందజేశారు. కార్యక్రమంలో కారంకి వెంకట శివ నారాయణ గౌడ్, బొర్రా వెంకట రామకృష్ణ గౌడ్, ఉంద్రకొండ గంగాధర్‌రావు గౌడ్, మొర్ల కామేశ్‌గౌడ్, మొర్ల శివరాం గౌడ్, కారంకి సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న ప్రజలు

సందడిగా సదర్ సమ్మేళనం

జగద్గిరిగుట్ట: బీజేపీ అఖిల భారత యాదవ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని లాస్ట్ బస్టాప్‌లో సదర్ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశం, అడిషనల్ ఎస్పీ జీ శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఎస్. మల్లారెడ్డి ముఖ్య నాయకులతో పాటు పలు డివిజన్ల కార్పొరేటర్లు, సినీ నటి కరాటే కల్యాణి, కాంగ్రెస్ నాయకురాలు అంజలి యాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు పున్నరెడ్డి, కంది శ్రీరాములు, సాయి నేత, పార్టీల నాయకులు తదితురులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో శేఖర్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్